క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలోకి చేరికలు



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని 17వ వార్డుకు చెందిన ఆరు కుటుంబాల వారు టీడీపీని వీడి సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ విజయానికి కృషిచేయాలని వారికి సూచించారు. వైఎస్సార్ సీపీలో చేరినవారిలో గుంజ నాగగోపి, బత్తుల నరసింహారావు, గుంజ వెంకటేశ్వర్లు, ప్రసాద పుపాటి గోపి, మల్లేష్, తమ్మిశెట్టి గోపి తదితరులు ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఏసీపీ

మల్కాపురం(జగ్గయ్యపేట): ఈ నెల 13న జరుగనున్న ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా పూర్తయ్యేలా అన్ని రాజకీయపార్టీలు, ప్రజలు సహకరించాలని నందిగామ ఏసీపీ రవికిరణ్ కోరారు. మండలంలోని మల్కాపురం సచివాలయం వద్ద అన్ని రాజకీయపార్టీల నాయకులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రవికిరణ్ మాట్లాడుతూ మల్కాపురం సమస్యాత్మక గ్రామంగా ఉందని, అన్ని రాజకీయ పార్టీలు ఘర్షణలకు తావులేకుండా నడుచుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలు పాటించటంతోపాటు పోలీసులకు సహకరించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ సతీష్, పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని అద్దాలబజారు శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి కల్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు వర్తక, వ్యాపార, వాణిజ్య విభాగాల వారితో మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు తుమ్మేపల్లి నరేంద్ర, కొత్తా పురుషోత్తం, పార్టీ వాణిజ్య విభాగం పట్టణ అధ్యక్షుడు చారుగుండ్ల కొండ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మీయ సమావేశానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు వివరించారు. వ్యాపారులంతా హాజరుకావాలని వారు కోరారు.

టీడీపీని వీడిన సయ్యద్‌మస్తాన్



భీమవరం(వత్సవాయి) : మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్‌నాయకుడు, మసీదు కమిటీ అధ్యక్షులు సయ్యద్ మస్తాన్ ఆపార్టీకి రాజీనామా చేసి సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. చిట్టేలలో జరిగిన కార్యక్రమంలో మస్తాన్‌కు సీనియర్ నాయకులు మారెళ్ల పుల్లారెడ్డి వైఎస్సార్ సీపీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సయ్యద్ మస్తాన్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడి అభివృద్ధి సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు చెప్పారు. టీడీపీ, బీజేపీతో పొత్తుపెట్టుకోవడం తగదన్నారు.వైఎస్సార్ సీపీ జిలా ఉపాధ్యక్షులు చింతకుంట్ల వెంకటరెడ్డి, నాయకులు గుండం రంగారెడ్డి, మాజీఎంపీటీసీ షేక్ నాగుల్‌హస్సేన్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రణ్ హుస్సేన్, బాలసైదా పాల్గొన్నారు.

ఫ్యాన్ ప్రభంజనం ఖాయం

విప్ ఉదయభాను



జగ్గయ్యపేటలో ఓట్లు అభ్యర్థిస్తున్న విప్ సామినేని ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని, సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వమే అధికారంలోకి వస్తోందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను అన్నారు. జగ్గయ్యపేటలోని పాతపేటగడ్డ, బంగారు కొట్ల సెంటర్, బలుసుపాడు రోడ్, మసీదు రోడ్డులో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం నాయకులతో కలసి ఆయన స్థానిక బంగారు కొట్ల సెంటర్‌లోని షాపులు, క్లాత్ మర్చంట్ షాపులు, కిరాణా, ఫ్యాన్సీ దుకాణాదారులను కలసి ఓట్లు అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ని గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతోపాటు ప్రజలంతా బాగుండాలనే మంచి మనసుతో సీఎం జగనన్న సుపరిపాలన అందిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఈ ఐదేళ్ల పాలనలో జరిగిన మునుపెన్నడూలేని అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు గుర్తుచేశారు. ఆయా పథకాల కింద దాదాపు రూ.1245 కోట్లు జగ్గయ్యపేట ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయన్నారు. రూ.2,400కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. వ్యాపార వర్గాలకు అనువుగా ఉండేందుకుగాను పేట ప్రజల దశాబ్దాల కల కృష్ణానదిపై ముక్త్యాల వద్ద వంతెన నిర్మాణానికి రూ.60 మంజూరు చేయించినట్లు చెప్పారు. ఈపనులను సంబంధించి ఇప్పటికే టెండర్లు పిలిచినట్లు తెలిపారు. పేట ప్రజల చిరకాల వాంఛ ప్యాసింజర్ రైలు కోసం 11సార్లు ఢిల్లీ వెళ్లి రూ.1490 కోట్లు మంజూరు చేయించామని, ప్రస్తుతం డబ్లింగ్ పనులు జరుగుతున్నాయని వివరించారు. తమ పాలనలో మేలు చేకూరితేనే ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, మున్సిపల్ మాజీ చైర్మన్, పార్టీ ఎలక్షన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్(చిన్నా), ఏఎంసీ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు చారుగుండ్ల కొండ, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి తుమ్మేపల్లి నరేంద్ర, ఆర్యవైశ్య సంఘ నాయకులు కొత్తా పురుషోత్తం, పార్టీ యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, వర్తక, వాణిజ్య, వ్యాపార సంఘాల ప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న పథకాలు..ప్రగతి రథచక్రాలు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



పొక్కునూరులో ప్రజలకు అభివాదం చేస్తున్న డాక్టర్ జగన్‌మోహనరావు, కేశినేని శ్వేత

చందర్లపాడు(నందిగామటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న నవరత్నాల పథకాలు ఆంధ్రుల ప్రగతికి రథచక్రాలని నందిగామ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలోని కాసరబాద, ఉస్తేపల్లి, పొక్కునూరు, చందర్లపాడు గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి నందిగామ ఎమ్మెల్యేగా తనను, విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ని గెలిపించాలని ఓటర్లను కోరారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా గ్రామానికి వచ్చిన డాక్టర్ జగన్ మోహనరావుకు పార్టీ శ్రేణులు, గ్రామస్తులు తీన్‌మార్ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి ఆశీర్వదించారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ నవరత్నాల పథకాలు నిరుపేదల జీవితాలలో వెలుగులు నింపాయని వివరించారు. గత ప్రభుత్వాలు వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేయగా, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం వ్యవసాయాన్ని పండుగలా మార్చారన్నారు. రైతుభరోసా పథకం, ఉచిత పంటల బీమా, సబ్సిడీపై ఎరువులు ఇలా రైతులకు అన్నిరకాలుగా సాయం అందించి రైతు బాంధవునిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని పేర్కొన్నారు. ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ కుమార్తె శ్వేత మాట్లాడుతూ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధికి ఎంపీగా కేశినేని శ్రీనివాస్ ఎంతో కృషి చేశారని తెలిపారు. ఎంపీగా కేశినేని శ్రీనివాస్, ఎమ్మెల్యేగా జగన్‌మోహనరావు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేశారని వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆమె కోరారు. ప్రచారంలో ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి, జడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, వెలగపూడి వెంకటేశ్వరరావు, కొమ్మినేని మహీంద్ర, హనిమి రెడ్డి, చల్లా శివాజీ, కృష్ణ, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



కాసరబాదలో మహిళల సందడి

పీవో, ఏపీవోలు నిబంధనలు పాటించాలి

ఆర్వో వెంకటేశ్వర్లు ఆదేశం



మాట్లాడుతున్న ఆర్వో వెంకటేశ్వర్లు

జగ్గయ్యపేట: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పీవో, ఏపీవోలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. బ్యాలెట్, ఈవీఎం మిషన్‌ల పనితీరుపై కల్పించారు. ఈసందర్భంగా రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది అందరూ నిబంధనలను తప్పకుండా పాటించాల్సిందేనన్నారు. ముఖ్యంగా ఓటరు ఓటువేసి బయటకు వెళ్లే వరకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో మిషన్‌లలో ఏవైనా సాంకేతిక కారణాలు తలెత్తితే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

నేటి నుంచి హోం ఓటింగ్..

నియోజకవర్గంలోని 222 పోలింగ్ కేంద్రాల పరిధిలో హోం ఓటింగ్ ప్రక్రియను మంగళవారం నుంచి మూడురోజుల పాటు కొనసాగుతుందని ఆర్వో వెంకటేశ్వర్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా హోం ఓటింగ్‌కు సంబంధించి 85 ఏళ్లకు పైబడినవారు 89మంది ఓటర్లు ఉండగా, దివ్యాంగులు 61మందితో కలిపి మొత్తం 150 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరి గృహాలకు ప్రత్యేకాధికారుల బృందం వెళ్లి వారు ఓటుహక్కును వినియోగించుకునే అవకాశం కల్పిస్తారన్నారు. ఇందుకోసం ఐదు బృందాలను నియమించినట్లు చెప్పారు. ఈబృందంలో పీవో, ఏపీవో, మైక్రోఅబ్జర్వర్, రూట్ ఆఫీసర్, బిఎల్‌వో, పోలీస్ అధికారి, వీడియోగ్రాఫర్ ఉంటారని వివరించారు.

జగన్‌మోహనరావు గెలుపు కాంక్షిస్తూ ప్రచారం



కంచికచర్లలో ఓట్లు అభ్యర్థిస్తున్న నన్నపనేని, వేమా తదితరులు



జుజ్జూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కంచికచర్ల : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి ఓటు వేస్తే ప్రతి ఇంటికి మేలు జరుగుతుందని ఆ పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబులు పేర్కొన్నారు. కంచికచర్లలో సోమవారం వారు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ జగన్‌మోహనరావు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)లు గెలిపించాలని కోరుతూ ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు మాడుగుల మధుబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, దాసరి రాము, డి.గురవయ్య, వేమా శివకోటి, పాండు, నారిశెట్టి శ్రీనివాసరావు, దేవిరెడ్డి శ్రీనివాసరావు, శీలంనేని గోపాలకృష్ణ, గుత్తా హనుమంతరావు పాల్గొన్నారు.

నాయకుల విస్తృత ప్రచారం..

మండలంలోని పరిటాల, గొట్టుముక్కల, పేరకలపాడు, గనిఆత్కూరు, కొత్తపేట, కునికెనపాడు, మున్నలూరు, పెండ్యాల, మోగులూరు, వేములపల్లి, కీసర, గండేపల్లి, ఎస్ అమరవరం, బత్తినపాడు తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచి బొక్కా రవికుమార్, సొసైటీ అధ్యక్షుడు మట్టా శ్రీనివాసరెడ్డి, బెల్లంకొండ సుబ్బారావు, జి.సత్యానారాయణ, సంగం దేవరాజు, కే రంగారావు, తలమాల రమేష్, షేక్ నసీర్ పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

జుజ్జూరు(వీరులపాడు): జుజ్జూరులో సర్పంచి రమావత్ కోటి, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో వైస్ ఎంపీపీ షేక్ నాగుల్‌మీరా, నాయకులు పూలా పుల్లయ్య, ఆకుల అంజియ్య, కొమ్ము శాంత, రమావత్ రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉదయభాను గెలుపు కోరుతూ ప్రచారం



ఓట్లు అభ్యర్థిస్తున్న మున్సిపల్‌చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర



ఓట్లు అభ్యర్థిస్తున్న తుమ్మల ప్రభాకర్, నాయకులు



కంభంపాడులో ప్రచారం చేస్తున్న నాయకులు



అనిగండ్లపాడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న సర్పంచి జ్యోతిబ్రహ్మం, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి సామినేని ఉదయభానును భారీ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఓటర్లను కోరారు. స్థానిక 11వ వార్డు, దుర్గాపురంలో సోమవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని 42,46 పోలింగ్ కేంద్రాల పరిధిలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లువేసి ఎమ్మెల్యేగా ఉదయభాను, ఎంపీగా కేశినేని శ్రీనివాస్‌లను గెలిపించాలని ప్రజలను కోరారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)ల విజయాన్ని కాంక్షిస్తూ ఆపార్టీ నాయకులు సోమవారం వత్సవాయి మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వత్సవాయి, మక్కపేట, పోలంపల్లి, భీమవరం, మంగొల్లు, కంభంపాడు, దబ్బాకుపల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా ఉదయభాను, ఎంపీగా కేశినేని శ్రీనివాస్‌లను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో తిరుమలగిరి ఆలయ చైర్మన్ కొమరగిరి రవీంద్రభరద్వాజ్, మక్కపేట గ్రామపార్టీ అధ్యక్షులు కనగాల రమేష్, సొసైటీ అధ్యక్షులు వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, కొండబోలు బ్రహ్మం, సామినేని లక్ష్మీనారాయణ, సర్పంచులు అన్నెపాక ప్రణీత, కొట్టె నగేష్, భూక్యా సీతమ్మ, చావా దుర్గారాణి, మాధురి పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): విజయవాడ ఎంపీగా కేశినేని నాని, జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా సామినేని ఉదయభానును గెలిపించాలని కోరుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెనుగంచిప్రోలులో సర్పంచి వేల్పుల పద్మకుమారి, పూసల కార్పొరేషన్ డైరక్టర్ చేని కుమారి, సొసైటీ అధ్యక్షులు గింజుపల్లి నరసింహారావు, ఉపసర్పంచి బాడిశ పాపారావు, నాయకులు కాకాని పద్మ, కాశీరాజ్ తదితరులు ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. అనిగండ్లపాడులో సర్పంచి బి.జ్యోతిబ్రహ్మం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, మండల ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య ఇంటింటికీ ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేయ్యాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో సొసైటీ అధ్యక్షుడు పిడికిటి కోటేశ్వరరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, నాయకులు కోలా రామారావు, జాన్‌మియా, గింజుపల్లి కోటేశ్వరరావు, పాలాది వెంకటరమణ, దానయ్య పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ రైల్వే ఉద్యోగి మృతి

రైల్వే స్టేషన్(విజయవాడ పశ్చిమ): విజయవాడ రైల్వే డివిజన్ గన్నవరం-చెరువు మాధవరం మధ్య రైల్వేట్రాక్‌పై సోమవారం విధులు నిర్వర్తిస్తున్న విజయవాడ గొల్లపాలెం గట్టుకు చెందిన చెల్ల రవి (29) అదే ట్రాక్‌పై వస్తున్న ట్రాస్ కార్ (రైల్వే విద్యుత్ లెన్ మరమ్మతులు చేసే కార్) ఢీకొనడంతో మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. విజయవాడ రైల్వే సూపరింటెండెంట్ జి.రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

కొనసాగుతున్న పోస్టల్ ఓటింగ్ ప్రక్రియ





జగ్గయ్యపేటలో ఓటు వేస్తున్న ఉద్యోగులు



నందిగామలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుంటున్న ఉద్యోగి

జగ్గయ్యపేట: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఎన్నిక ప్రక్రియలో మూడోరోజు సోమవారం 490మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్న సమయంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకున్నారని జగ్గయ్యపేట ఆర్వో వెంకటేశ్వర్లు వివరించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ మంగళ, బుధవారాల్లో కూడా కొనసాగుతుందని తెలిపారు. ఉద్యోగులు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఓటేసిన 616మంది ఉద్యోగులు

నందిగామ: ప్రశాంతమైన వాతావరణంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ జరుగుతోందని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.రవీంద్రరావు తెలిపారు. పట్టణంలోని కెవిఆర్ కళాశాలలో సోమవారం కూడా పోస్టర్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను నిర్వహించారు. నియోజకవర్గంలోని 616మంది ఉద్యోగులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. నందిగామ నియోజకవర్గ పరిధిలో హోం ఓటింగ్ కోసం 109మంది దరఖాస్తులు చేసినట్లు ఆర్వో తెలిపారు. హోం ఓటింగ్ ప్రక్రియను కూడా సమర్థవంతంగా పూర్తిచేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆర్వో వివరించారు.

జగ్గయ్యపేటకు నూతన సొబగులు



సెంట్రల్ లైటింగ్ వెలుగుల్లో జగ్గయ్యపేట-చిల్లకల్లు రోడ్డు



విద్యుత్ వెలుగుల్లో ఊరచెరువు



ప్రత్యేకాకర్షణగా వాటర్ ఫౌంటెయిన్



వైఎస్సార్ సర్కిల్‌లో...



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఫౌంటెన్



ప్రభుత్వాసుపత్రి వద్ద వెలుగులు

జగ్గయ్యపేట పట్టణం నూతన సొబగులతో వెలిగిపోతోంది. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కోట్లాది రూపాయల నిధులతో ఊరచెరువును పార్కుగా అభివృద్ధి..లాన్ ఏర్పాటు..ఆయా రోడ్లలో సెంట్రల్ లైటింగ్, కూడళ్లలో ప్రత్యేక వాటర్ ఫౌంటెయిన్లు ఏర్పాటు చేయించారు.ఇప్పటికే పారిశ్రామిక వెలుగులు నిండిన జగ్గయ్యపేట పట్టణం రాత్రివేళల్లో విద్యుత్ వెలుగులతో కాంతులీనుతోంది. పట్టణంలోకి వచ్చే వారికి రూ.14కోట్లతో నిర్మించిన చిల్లకల్లు-జగ్గయ్యపేట నాలుగులేన్ల రోడ్డుతోపాటు సెంట్రల్ లైటింగ్ ఘన స్వాగతం పలుకుతోంది. పార్కుగా అభివృద్ధి చేసిన ఊరచెరువు పట్టణ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందిస్తోంది. రాత్రివేళల్లో విద్యుత్ దీపాల వెలుగుల్లో ప్రత్యేకార్షణగా నిలుస్తోంది. పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్, సత్యనారాయణపురం అంబేద్కర్ విగ్రహం, ప్రభుత్వాసుపత్రి వద్ద మొత్తం రూ.34లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్ల విద్యుత్‌వెలుగులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇలా ప్రత్యేక విద్యుద్దీపాలంకరణ ధగధగలతో జగ్గయ్యపేట పట్టణం రాత్రివేళల్లో మెరిసిపోతుండటంపై పట్టణవాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

– పెనుగంచిప్రోలు/జగ్గయ్యపేట అర్బన్

సర్టిఫికెట్లు అందజేత

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈడీఎక్స్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్లను అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, ఈడీఎక్స్ కోర్స్ కో-ఆర్డినేటర్ బి.సుభాషిణి, లెక్చరర్లు బాలసుబ్రహ్మణ్యం, కె.శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.